చెత్త వేయడాన్ని ప్రశ్నించినందుకు ఎస్‌ఎఫ్‌ఏపై దాడి



ఎస్‌ఎఫ్‌ఏ బాబురావుపై దాడి చేసింది వీరే

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై చెత్త ఎందుకు వేస్తున్నారు? మీ ఇంటికి స్వచ్ఛ ఆటో రావడం లేదా అని ప్రశ్నించినందుకు ఎఫ్ఎఫ్ఏపై భార్యభర్త దాడి చేశారు. కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ ఎల్ఐజీ ప్లాట్ నంబర్ 43లో నివాసం ఉంటున్న అమిత్ అతని భార్య బైక్‌పై వచ్చి బుధవారం ఉదయం రోడ్డుపై చెత్త వేస్తుండగా విధుల్లో ఉన్న ఎస్ఎఫ్ఏ బాబురావు వారిని అడ్డగించాడు. మీరేంటి నాకు చెప్పేది అంటూ అమిత్ భార్య చేయిచేసుకుంది. ఎదురు తిరగడంతో మీ చెత్త మొహాలు తమకు చెప్పేంతటి ధైర్యం మీకు ఎవరు ఇచ్చారంటూ అమిత్ బైక్ పక్కనపెట్టి పిడిగుద్దులు గుద్దాడు. అక్కడే పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సంఘటనా స్థలానికి చేరుకొని ఎస్ఎఫ్ఏపై దాడికి పాల్పడిన వారిని గట్టిగా వారించారు. అనంతరం ఎస్ఎఫ్ఏ తనపై జరిగిన దాడి గురించి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మూడు స్కూల్ వ్యాన్ల సీజ్



సీజ్ చేసిన వాహనాలతో ఎంవీఐ శ్రీనుబాబు, ఆర్టీఏ సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి ఆర్టీఏ అధికారులు బుధవారం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ బస్సులు, వ్యాన్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఫిట్‌నెస్ లేని మూడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అలాగే మరో రెండు వాహనాలు రోడ్డుట్యాక్స్ కట్టకుండా రోడ్లపై తిరుగుతుండటంతో వాటిని కూడా సీజ్ చేశామన్నారు. ట్యాక్స్, ఫిట్‌నెస్ లేకుండా వాహనాలను తిప్పుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్న బస్సులు, వ్యాన్లను మాత్రమే విద్యాసంస్థలకు వినియోగించాలన్నారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు



జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏకాంత్‌గౌడ్, విద్యకల్పన

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో నాయకులు ఏకాంత్‌గౌడ్, విద్యకల్పన, ఏకాంత్‌గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భానుయాదవ్, గణేష్‌గౌడ్, అశోక్, జితేందర్, నాగమణి, భూషణం, సంపంగి, యాదగిరి, శ్రీను, దయాకర్‌రెడ్డి, అంబిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో మాట్లాడుతున్న గణేష్‌నగర్ మహిళలు

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గణేష్‌నగర్ కాలనీలో మంజీర వాటర్ ప్రెజర్ తక్కువరావడంతో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో ఏ సమస్య తన దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, గణేష్‌నగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

శెట్టి బలిజలను బీసీలలో చేర్చాలి: ఆరెకపూడి



ర్యాలీలో పాల్గొని శెట్టిబలిజలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రాయితీలు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న శెట్టిబలిజ కులస్తులకు తాను సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శెట్టిబలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలని ఆల్విన్‌కాలనీ తులసీవనం వద్ద బీసీ కమిషన్‌కు ర్యాలీగా వెళ్లి తమ గోడు విన్నవించుకునేందుకు వెళ్తున్న శెట్టి బలిజ కులస్తులకు సంఘీభావంగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, రావుల శేషగిరిరావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొని మద్దతు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ మేరకు బీసీ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని త్వరలో బీసీ జాబితాలో చేర్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కులస్తుల నాయకులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 27, వంకాయ 23, బెండకాయ 40, పచ్చి మిర్చి 28, బజ్జి మిర్చి 25, కాకరకాయ 42, బీరకాయ 40, క్యాబేజీ 15, బీన్స్ 75, క్యారెట్ 40, గోబి పువ్వు 28, దొండకాయ 23, చిక్కుడుకాయ 65, గోరు చిక్కుడు 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీర 23, దోసకాయ 21, సొరకాయ 12, పొట్లకాయ 25, కంద 50, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 22, మామిడి కాయ 15-20, అరటికాయ 9-11, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 30-40, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 70, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 55, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రోబోటిక్స్.. బ్యూటీషియన్‌లో శిక్షణ



స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు బోధన

ప్రభుత్వ పాఠశాలలో ఒకేషనల్ కోర్సులో భాగంగా బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నారు. మరోవైపు ఆగస్త్య సంస్థ పర్యవేక్షణలో కంప్యూటర్ కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అధునాతన టెక్నాలజీ ఏఐ ద్వారా రోబోటిక్స్‌లోను విద్యార్థులకు శిక్షణ ఇస్తూ సాంకేతిక విద్యను 8వ తరగతి నుంచే అందిస్తున్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులతో ఉపాధ్యాయులు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా..

- డిజిటల్ క్లాసురూంలు.. అధునాతన ల్యాబ్‌లు
- విశాలమైన తరగతి గదులు.. రోబోటిక్స్, బ్యూటీషియన్ కోర్సులు
- ఏటా 300కు పైగా అడ్మిషన్‌లు.. ఎన్‌సీసీలో శిక్షణ
- ఇదీ కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఘనత

కూకట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విశాలమైన తరగతి గదులు.. ఒకే గదిలో 5 నుంచి 6 వరకు ఫ్యాన్లు.. కొన్ని తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలు మరికొన్ని గదుల్లో ప్రొజెక్టర్లతో డిజిటల్ తరగతి గదులు దర్శనమిస్తాయి. ప్రతీ తరగతి గదిలో పిల్లలు ఏం చేస్తున్నారో గమనించేలా ప్రతీ గదిలో సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయుడు వీక్షిస్తూ విద్యార్థులను పర్యవేక్షిస్తుంటాడు. పాఠశాల ఆవరణలో అడుగుపెడితేనే కార్పొరేట్ పాఠశాలను తలపించేలా కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దర్శనమిస్తోంది.

ఏటా 300కు పైగా అడ్మిషన్‌లు

కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 1100 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో విశాలమైన 16 తరగతి గదులు ఉండటంతో విద్యార్థులకు సరిపడా వెలుతురు వచ్చేలా కిటికీలు.. స్వచ్ఛమైన గాలితో పాటు అన్ని తరగతి గదుల్లో సరిపడా ఫ్యాన్‌లు కూడా ఉన్నాయి. మరోవైపు స్మార్ట్ టీవీలు, ప్రొజెక్టర్లతో విద్యార్థులకు డిజిటల్ బోర్డులతో అర్థమయ్యేలా బోధిస్తున్నారు. అధునాతన హంగులున్న ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెరుగైన వసతులు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. దాంతో 2024లో పాఠశాలలో సుమారు 350 అడ్మిషన్‌లు వచ్చాయని ఉపాధ్యాయులు తెలిపారు. మరోవైపు ఎన్‌సీసీలోను విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 2025-2026 సంవత్సరానికి గాను ఒక పదవతరగతిలోనే 232 మంది విద్యార్థులు ఉన్నారు. ఈసంవత్సరం కూడా 300 వరకు నూతన అడ్మిషన్‌లు వచ్చే అవకాశం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగానే పాఠ్య పుస్తకాలు. యూనిఫామ్ కూడా అందిస్తున్నారు.



పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్

మెరుగైన బోధన.. ఉత్తమ ఫలితాలు



కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. డిజిటల్ క్లాస్‌రూంలు.. సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్‌ల్యాబ్, ఒకేషనల్ కోర్సు, ఎన్‌సీసీలో శిక్షణ, ఒకేషనల్ కోర్సులతో విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాం. ఏటా 10వ తరగతిలో 550పైగా మార్కులు సాధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

- నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం, కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అమ్ముకొని సొమ్ము చేసుకోవడమేనా?



వేలం వద్ద బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



స్టేషన్‌లో బీజేపీ నాయకులను పరామర్శిస్తున్న మాధవరం కాంతారావు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ఇవ్వాల్సిన స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకోవడం ఏంటని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. టీజీహెచ్‌బీ వెస్ట్రన్ డివిజన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు స్థలాలను కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్లో బుధవారం వేలం వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్థలాలను అమ్మడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు వేలం అడ్డుకునేందుకు యత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న బీజేపీ నాయకులను కాంతారావు పరామర్శించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత విస్మరించారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ స్థలాలను ఇందిరమ్మ ఇండ్లు, పార్కులు ఇతరత్రా ప్రజాప్రయోజనాలకు వినియోగించాలే తప్ప అమ్మడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మధుగౌడ్, వినోద్‌కుమార్ గౌడ్, గోపీ, గురుప్రసాద్, తోట రమేష్, వెంకటరమణ, సత్యనారాయణ, రాములు, అనీల్, అనూష్, రేవతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌తోనే

తెలంగాణ అన్నపూర్ణగా మారింది

ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్నపూర్ణగా మారిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతుండటంతో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కూకట్‌పల్లికి చెందిన కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున బీఆర్‌కే భవన్‌కు వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ, నీళ్ల కోసం తల్లడిల్లిన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించి సాగు, తాగు నీరు అందించిన మాజీ సీఎం తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన తప్పేంటి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ సరైన రీతిలో సమాధానం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం సిద్ధించిన 10 ఏళ్లలోనే దేశంలోనే అభివృద్ధి అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పగడాల శిరీషబాబూరావు, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి, శ్రీహరి మందాడి శ్రీనివాసరావు, మాజీకార్పొరేటర్లు బాబూరావు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కార్పొరేటర్లు

కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించండి

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు మూసాపేట కార్పొరేటర్ వినతి

కూకట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కబీర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను 44 ఏళ్ల క్రితం నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను మూసాపేట కార్పొరేటర్ మహేందర్ కోరారు. గురువారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కబీర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునర్నిర్మాణంతో పాటుమూసాపేట జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి కూకట్‌పల్లి బస్‌డిపో వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరానని చెప్పారు. అలాగే కబీర్‌నగర్ నాలా విస్తరణలో కొన్ని కాలనీలకు అప్రోచ్ రోడ్డు లేకుండా పోయిందని, నాలాపై కప్పు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.



జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన మూసాపేట కార్పొరేటర్ మహేందర్

విద్యార్థులకు మూత్రశాలలు కరువు

మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల కోసం ప్రయత్నాలు

కూకట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 450పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది 500 వరకు వచ్చే అవకాశం ఉంది. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు నిర్మించాల్సిన అవసరం ఎంతో ఉంది. 5 మూత్రశాలలు, రెండు టాయ్‌లెట్స్ కలిపితే ఒక యునిట్‌గా పరిగణిస్తారు. ఇది సుమారు 200 నుంచి 250 మంది విద్యార్థులకు ఉపయోగ పడుతుంది.. కాని మూసాపేటలో ప్రస్తుతానికి ఒక్క యూనిట్‌తో నెట్టుకొస్తున్నారు. మరోవైపు తరగతి గదుల కొరత కూడా ఉండటంతో అదనపు తరగతుల కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపించారు.



పాఠశాల ప్రారంభం సందర్భంగా పరిశుభ్రం చేసిన తరగతిగదిలో బెంచీలు



మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాకేశ్ గౌడ్ తెలిపారు. ఎన్ఐఏ సబ్ స్టేషన్ పరిధిలోని ఖైతలాపూర్ ఫ్లై-ఓవర్ పరిసరాలు, బ్యాంక్ కాలనీ, ఆర్.ఆర్.ఆర్. బార్ అండ్ రెస్టారెంట్, చందానగర్ తండా ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే బోరబండ సబ్ స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్ పార్కు, హరిహర టెంపుల్, గాయత్రినగర్ నాలా, లక్ష్మీ నగర్, పర్వత్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

అల్లాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రైల్వే ట్రాక్ సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు అల్లాపూర్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లాలూనాయక్‌కు సోమవారం సమాచారం అందింది. ఆ వ్యక్తిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటాయని, తెల్ల జుత్తు, కుడి కాలికి నల్లటి దారం ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేకుల షెడ్డులోనే ప్రభుత్వ పాఠశాల





రేకుల షెడ్డు పాఠశాల ఇదే, గదులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని భువనం విజయం ప్రభుత్వ పాఠశాల నీటి సంపు స్థలంలో రేకుల షెడ్డులోనే కొనసాగుతోంది. అరకొర వసతుల మధ్య 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. బుధవారం బెంచీలను బయట పెట్టి గదులను శుభ్రం చేశారు. రెండేళ్ల క్రితం రమ్యగ్రౌండ్‌లో పాఠశాల కోసం శంకుస్థాపన చేసినా శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అక్కడ నందమూరి తారకరామారావు ప్రభుత్వ పాఠశాల నిర్మిస్తే ఇక్కడి పాఠశాలను అక్కడికి తరలిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జగ్జీవన్‌రామ్ బస్తీలో రోడ్డు పనులు ప్రారంభం



మూసాపేటలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేట డివిజన్ జగ్జీవన్‌రామ్ బస్తీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షం వచ్చినపుడు వరద నీరు రోడ్డుపై ఎక్కడా నిల్వకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, బీజేపీ నాయకులు మల్లేశ్,ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేయడాన్ని ప్రశ్నించినందుకు ఎస్ఎఫ్ఏపై దాడి



ఎస్ఎఫ్ఏ బాబురావుపై దాడి చేసింది వీరే

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై చెత్త ఎందుకు వేస్తున్నారు? మీ ఇంటికి స్వచ్ఛ ఆటో రావడం లేదా అని ప్రశ్నించినందుకు ఎస్ఎఫ్ఏపై భార్యభర్త దాడి చేశారు. కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ ఎల్ఐజీ ప్లాట్ నంబర్ 43లో నివాసం ఉంటున్న అమిత్ అతని భార్య బైక్‌పై వచ్చి బుధవారం ఉదయం రోడ్డుపై చెత్త వేస్తుండగా విధుల్లో ఉన్న ఎస్ఎఫ్ఏ బాబురావు వారిని అడ్డగించాడు. మీరేంటి నాకు చెప్పేది అంటూ అమిత్ భార్య చేయిచేసుకుంది. ఎదురు తిరగడంతో మీ చెత్త మొహాలు తమకు చెప్పేంతటి ధైర్యం మీకు ఎవరు ఇచ్చారంటూ అమిత్ బైక్ పక్కనపెట్టి పిడిగుద్దులు గుద్దాడు. అక్కడే పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సంఘటనా స్థలానికి చేరుకొని ఎస్ఎఫ్ఏపై దాడికి పాల్పడిన వారిని గట్టిగా వారించారు. అనంతరం ఎస్ఎఫ్ఏ తనపై జరిగిన దాడి గురించి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మూడు స్కూల్ వ్యాన్ల సీజ్



సీజ్ చేసిన వాహనాలతో ఎంవీఐ శ్రీనుబాబు, ఆర్టీఏ సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి ఆర్టీఏ అధికారులు బుధవారం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ బస్సులు, వ్యాన్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఫిట్‌నెస్ లేని మూడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అలాగే మరో రెండు వాహనాలు రోడ్డుట్యాక్స్ కట్టకుండా రోడ్లపై తిరుగుతుండటంతో వాటిని కూడా సీజ్ చేశామన్నారు. ట్యాక్స్, ఫిట్‌నెస్ లేకుండా వాహనాలను తిప్పుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్న బస్సులు, వ్యాన్లను మాత్రమే విద్యాసంస్థలకు వినియోగించాలన్నారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు



జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏకాంత్‌గౌడ్, విద్యకల్పన

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో నాయకులు ఏకాంత్‌గౌడ్, విద్యకల్పన, ఏకాంత్‌గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భానుయాదవ్, గణేష్‌గౌడ్, అశోక్, జితేందర్, నాగమణి, భూషణం, సంపంగి, యాదగిరి, శ్రీను, దయాకర్‌రెడ్డి, అంబిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో మాట్లాడుతున్న గణేష్‌నగర్ మహిళలు

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గణేష్‌నగర్ కాలనీలో మంజీర వాటర్ ప్రెజర్ తక్కువరావడంతో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో ఏ సమస్య తన దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, గణేష్‌నగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

శెట్టి బలిజలను బీసీలలో చేర్చాలి: ఆరెకపూడి



ర్యాలీలో పాల్గొని శెట్టిబలిజలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రాయితీలు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న శెట్టిబలిజ కులస్తులకు తాను సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శెట్టిబలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలని ఆల్విన్‌కాలనీ తులసీవనం వద్ద బీసీ కమిషన్‌కు ర్యాలీగా వెళ్లి తమ గోడు విన్నవించుకునేందుకు వెళ్తున్న శెట్టి బలిజ కులస్తులకు సంఘీభావంగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, రావుల శేషగిరిరావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొని మద్దతు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరు బీసీ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ మేరకు బీసీ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని త్వరలో బీసీ జాబితాలో చేర్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కులస్తుల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

కుత్బుల్లాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీకి చెందిన మధుస్మితకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.40 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు.

సిక్కుల బస్తీలో 'కార్డన్ సెర్చ్'

జీడిమెట్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిక్కుల బస్తీలో పోలీసులు బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇద్దరు ఏసీపీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఓటీ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, 100 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 45 వాహనాలను సీజ్ చేయడంతో పాటు అక్రమంగా సాగుతున్న రెండు మద్యం బెల్టు షాపులను గుర్తించి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నరకయాతన..!



కైలాష్‌నగర్ కాలనీ కల్లు షాప్ వద్ద రోడ్డుపై కంకర

- అడుగులోతు గుంతలు.. కంకర రోడ్లు
- హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో రోడ్ల దుస్థితి
- ప్రయాణికుల ఇక్కట్లు

చందానగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): కింకరులైనా నడువలేని కంకర రోడ్డు. ఇది ఎక్కడో కుగ్రామంలో కాదు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉండే చందానగర్ సర్కిల్ చందానగర్-అమీన్‌పూర్ వరకు వెళ్లే శ్రీదేవి థియేటర్ రోడ్డు దుస్థితి. రోడ్డుపై కంకరతేలి అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు నరకయాతనకు గురవుతున్నారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా ఏడేళ్ల నుంచి పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డును 150 అడుగుల వెడల్పు చేయాలని 2018న శంకు స్థాపన చేశారు. కొంత వరకు పనులు చురుకుగా సాగినా.. ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ బాక్స్ పూర్తిచేయాల్సి ఉండగా ఒకవైపు మాత్రమే చేశారు. రోడ్డు నిర్మాణ పనులు గత 8 నెలల నుంచి నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై పలు చోట్ల కంకర తేలి.. మరికొన్ని చోట్ల అడుగులోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో ఈ రోడ్డు పొడవునా వీధిదీపాలు వెలగకపోవడంతో గుంతలు కనిపించక ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా కైలాష్‌నగర్ కల్లు దుకాణం వద్ద, వేమనరెడ్డి కాలనీ, రాజేందర్‌రెడ్డి నగర్ కమాన్, అమీన్‌పూర్ కమాన్ వద్ద రోడ్డు పూర్తిగా గుంతలు, కంకరతో అధ్వానంగా మారింది. ఈ మార్గం ద్వారా సుమారుగా 50 కాలనీవాసులతో పాటు ఐటీ కంపెనీల్లో పని చేయడానికి వందల సంఖ్యల్లో నిత్యం హైటెక్ సిటీ, రాయదుర్గం, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు.



రాజేందర్ కమాన్ వద్ద రోడ్డు దుస్థితి

తరచూ ప్రమాదాలు



చందానగర్ నుంచి రాజేందర్‌రెడ్డినగర్ వరకు రోడ్డు గుంతలు, కంకరతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యల్లో వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుపై అడుగులోతు గుంతలు ఉండడంతో తరచుగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

- రఘుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం



చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు గల శ్రీదేవి థియేటర్ రోడ్డు నిర్మాణం మందకొడిగా సాగుతున్నది. కొన్ని సాంకేతిక కారణాలతో కొన్ని రోజుల నుంచి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులను సమన్వయపరిచి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటాం.

- మంజులరఘునాథ్‌రెడ్డి, కార్పొరేటర్, చందానగర్

నల్లగండ్ల నాలా విస్తరణకు సహకరించాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



నాలాను సందర్శించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి

గచ్చిబౌలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ప్రాంతంలోని నల్లగండ్ల పెద్ద చెరువు నుంచి బెల్ చౌరస్తావరకు గల నాలా విస్తరణ జరుగుతున్న పనులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాలా విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని అన్నారు. గతంలో వర్షాకాలంలో తారానగర్, లింగంపల్లి ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు ఉండేది కాదని, ఇప్పుడు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పనులు చేస్తే ఇబ్బందులు కల్గించడం మంచిది కాదని అన్నారు. వర్షాకాలం ముంచుకు వస్తుంది.. పనుల్లో వేగం పెంచాలని, గడువులోగా పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పనులు పూర్తిగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఇంజనీర్లు నిఖిల, యుగేందర్, పవణ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తులసిరామ్, జీషాన్, సంతోష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్,

అభివృద్ధిలో గచ్చిబౌలిని ముందువరుసలో నిలబెడతా: కార్పొరేటర్

గచ్చిబౌలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పాతగ్రామంలో ప్రజలకు మౌలిక వసతులన్ని కల్పించడం జరిగిందని, మరికొన్ని ప్రాంతా ల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉందని వాటిని త్వరలో పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. బుధవారం గచ్చిబౌలి పాత గ్రామంలో ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న కొన్నిసమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని, పారిశుద్ధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని చెత్తకుప్పలు రోజుల తరబడి పేరుకుపోతున్నాయని ప్రజలు వివరించారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, ప్రజలకు ఆయనకు హామీనిచ్చారు. అక్కడినుంచే పారిశుద్ధ్య నిర్వహణ అధికారితో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో పాత గ్రామం శుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని, చెత్తను వెంటనే తరలించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. వీధి నంబర్ 2, 3 లో వేయాల్సిన సీసీ రోడ్లను ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వేయాలో ఆ ప్రాంతాలను పరిశీలించారు. సీసీ రోడ్ల పనులు కూడా త్వరలో ప్రాంభించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్ ఈఈ సుమన్, గ్రామ అధ్యక్షుడు నందుసింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట' ర్యాలీ

పేట్‌బషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను లాలించి చదువులు చెప్పే ఒడి అంగన్‌వాడీ బడి అని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డినగర్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు గిరినగర్, గుడెన్‌మెట్, రంగారెడ్డినగర్, చెన్నారెడ్డి నగర్, నందానగర్,గాంధీనగర్, వెంకట్‌రామిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లోని వీధుల్లో బడిబాట ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులతో సమావేశాలు నిర్వహించి, ప్రీ స్కూల్ వస్తువులు వాటి ప్రాముఖ్యతను వివరించి, అంగన్‌వాడీ బడుల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర్‌బాలలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రం నుంచి పౌషికాహారాన్ని తీసుకెళ్లాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని జ్యోతి అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు, టీచర్లు

పేదలకు వరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ : గాంధీ

మియాపూర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పేదలకు ఓ వరం లాంటిదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం మియాపూర్ క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ రోజు దాదాపు రూ.82లక్షల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జూన్11 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నల్లగండ్ల, హుడాకాలనీ, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్-1,2, డాక్టర్స్ కాలనీ, డిఫెన్స్‌కాలనీ, నవోదయలో విద్యుత్ ఉండదన్నారు.

- ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఏపీహెచ్‌బీకాలనీ, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు జయభేరిఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీకాలనీ, ఓల్డ్‌గచ్చిబౌలి, మెరీడియన్, యూనివర్సల్ రియల్టర్స్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ ఉండదు.

బైరవోనిచెరువులో గుర్తు తెలియని మృతదేహం



నిజాంపేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి ప్రాంతంలోని బైరవోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి బుధవారం బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతుడు ఆకుపచ్చ రంగు టీషర్టు, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో రుద్రాక్ష మాల ఉంది. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు కనిపించలేదు.ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి పోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యాచకుడి మృతి

నిజాంపేట్,జూన్11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ యాచకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి వికాస్ స్కూల్ సమీపంలో ఈనెల 8న 35-40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 108లో పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 10న మృతి చెందాడు.



కమిషన్ కార్యాలయం వద్ద శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్‌నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా

కేసీఆర్‌కు మద్దతుగా కమిషన్ కార్యాలయానికి...

రాయదుర్గం, జూన్11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై విచారణకు ముందు తన అభిప్రాయం వివరించడానికి వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు సంఘీభావంగా కమిషన్ కార్యాలయం వద్ద శేరిలింగంపల్లి నియోకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగడుగునా అడ్డంకులే..

నల్లగండ్ల నాలా పనులకు అక్రమార్కుల ఆటంకాలు



నల్లగండ్ల హుడాకాలనీ నాలా విస్తరణ పనులు

గచ్చిబౌలి, జూన్ 11, (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల నాలా విస్తరణ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎందుకంటే పూర్వపు నాలాను కొంత మంది తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ క్రమంలో నాలా అనేక వంకర్లు తిరిగింది. కొత్తగా నాలా విస్తరణ పనులు ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా రూ.17 కోట్లతో సుమారు 2.6 కిలో మీటర్ల మేర నాలా విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే రెండు నెలల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. పనులు ప్రారంభం నుంచి నాలా పనులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పనిచేసే తమపై దాడులకు దిగుతున్నారని కార్మికులు వాపోతున్నారు. దీంతో నాలా విస్తరణ పనులు ముందుకుసాగం లేదు. కాంట్రాక్టర్ వత్తిడితో అధికారులే చివరికి హైడ్రా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. పనులు ప్రారంభం మొదలు నాలాను ఆక్రమించిన వారు ఏదోరకంగా ఇటు కార్మికులను, కాంట్రాక్టర్‌ను, అటు అధికారులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రధానంగా నాలాను ఆనుకొని అక్రమంగా ఎన్నో నిర్మాణాలు వెలిశాయి. మరికొన్ని చోట్ల నాలాను పూర్తిగా మార్చేసి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు. ఓ నిర్మాణ సంస్థ నల్లగండ్ల చెరువు వద్ద నుంచి పారుతున్న నాలా ను ఇష్టానుసారం మార్చుకున్నారు. విల్లాల నిర్మాణం కోసం సహజంగా పారుతున్న నాలాను తనకు అనుకూలంగా మార్చేశారు. దీంతో నాలాను పూర్తిగా విరుద్ధంగా మార్చడం వల్ల డాక్టర్స్ కాలనీలో కొన్ని భవనాలకు ముప్పువాటిల్లుతోంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు దాదాపు మూడు భారీ భవనాలను ఖాళీచేయించాల్సి వచ్చింది. ఈ నిర్మాణ సంస్థకు గత ప్రభుత్వ పెద్దల సహకారంతోనే నాలాను తనకు అనుకూలంగా మార్చుకున్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి.

తాజాగా నాలాకు అడ్డుగా వచ్చిన నిర్మాణదారులకు అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో నాలా ఆక్రమణ దారుల్లో గుబులు మొదలైంది. నాలా ఆక్రమణ జరిగిందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వేచేశారు. వారు సుమారు 85 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఈ నిర్మాణాల్లో కొన్ని పాక్షికంగా మరికొన్ని పూర్తిగా తొలగించాలని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో అధికారులు ఆక్రమణ దారులందరికి నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకు సుమారు 45 మందికి నోటీసులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు. మిగతావారికి ఇవ్వాల్సి ఉంది.. కానీ అధికారులు కొందరికి నోటీసులు ఇచ్చి మరి కొందరికి ఇవ్వకపోవడం తో స్థానికంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కొంత మంది ప్రజా ప్రతినిధుల హస్తం ఉందని వారి అండ దండలతోనే అధికారులు మిగతా వారికి నోటీసులు ఇవ్వడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో నోటీసులు అందుకున్న వారు కొంత మంది కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది. దీంతో నాలా విస్తరణ పనులు పూర్తవుతాయలేదా అనే మీమాంస ప్రజలో వ్యక్తమవుతోంది.

నిర్మాణదారులందరికి నోటీసులు ఇచ్చాం

నల్లగండ్ల నాలకు అడ్డువచ్చిన నిర్మాణదారులందరికి నోటీసులు ఇచ్చాం. ఇప్పటి వరకు సుమారు 40 మందికి నోటీసులు జారీచేశాం. మిగతా వారికి కూడా ఇస్తాం. సహజ నాలా పటం ప్రకారం నోటీసులు ఇవ్వాలి. కానీ ఆ పాత నక్షా దొరకడంలేదు. 2010 గూగుల్ ప్రకారం నోటీసులు జారీ చేశాం. అంతకు పూర్వం నాలా నక్ష (పటం) కోసం చూస్తున్నాం. దొరికితే దాని ప్రకారం నోటీసులు ఇస్తాం. పనులను పూర్తి చేస్తాం.

- ఈ ఈ ధీరజ్, ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సత్కరించిన సీఐ మల్లేశ్

నిజాయితీతో పనిచేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

జీడిమెట్ల,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి నీతి, నిజాయితీతో పనిచేసి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ అన్నారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఆరుగురు పోలీసులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బదిలీ వెళ్తున్న వారిలో ఏఎస్‌ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ స్వరూప, కానిస్టేబుల్ మణిరత్నకుమారి, కానిస్టేబుల్ లక్ష్మన్, హెడ్‌కానిస్టేబుల్ మహదేవ్, కానిస్టేబుల్ ప్రకాశ్ ఉన్నారు. కార్యక్రమంలో డీఐ కనకయ్య, ఎస్‌ఐలు ప్రేమ్‌సాగర్, నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు సిద్ధం



ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో సిద్ధంగా ఉన్నాయి. గతంలో పాఠ్య పుస్తకాలు ఒకే సారి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. అయితే, ఈ ఏడాది అన్ని పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని ఉపాధ్యాయులు చెప్తున్నారు.

పేట్‌బషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి)



లబ్ధిదారు కుటుంబ సభ్యుడికి ఎల్‌ఓసీని అందజేస్తున్న కార్పొరేటర్

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

కుత్బుల్లాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీకి చెందిన మధుస్మితకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.40 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే వివేకానంద్ సహకారంతో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

సిక్కుల బస్తీలో 'కార్డన్ సెర్చ్'

జీడిమెట్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిక్కుల బస్తీలో పోలీసులు బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇద్దరు ఏసీపీలు, 4 ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఓటీ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, 100 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 45 వాహనాలను సీజ్ చేయడంతో పాటు అక్రమంగా సాగుతున్న రెండు మద్యం బెల్టు షాపులను గుర్తించి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 17మంది పాతనేరస్తులు, అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. విచారిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



సంబురాలు జరుపుకుంటున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

షాపూర్ నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ అన్నారు. తెలంగాణ మంత్రివర్గంలో దళితులకు 25 శాతం కేటాయించిన సందర్భం గా గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ, మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం అమలుకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సుదీర్ఘకాలం తర్వాత పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీలతోనే మంత్రివర్గ విస్తరణ జరిగిందన్నారు. కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు మంత్రులకు అభినందనలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం సాధ్యమని మరోసారి స్పష్టమైందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి

నిజాంపేట్,జూన్11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యాచకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి వికాస్ స్కూల్ సమీపంలో ఈనెల 8వ తేదీన దాదాపు 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 108 అంబులెన్స్‌లో పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 10వ తేదీన మృతి చెందాడు. కాగా, మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే బాచుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బైరవోనిచెరువులో గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

నిజాంపేట్,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి ప్రాంతంలోని బైరవోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి బుధవారం బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతుడు ఆకుపచ్చ రంగు టీషర్టు, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో రుద్రాక్ష మాల ఉంది. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు కనిపించలేదు.ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి పోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వహణ కొరవడి అస్తవ్యస్తంగా...

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- కనుమరుగైన పచ్చదనం
- పార్కుకు వచ్చేందుకు జనం విముఖత
- ఇదీ రాజీవ్‌గాంధీ పార్కు



పచ్చదనం లోపించిన రాజీవ్‌గాంధీపార్కు



పార్కు కాంపౌండ్‌వాల్ పక్కన వ్యాపార సముదాయం

షాపూర్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్వహణ కొరవడి అస్తవ్యస్తంగా మారుతున్నాయి. షాపూర్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ పార్కు దుస్థితితే ఇందుకు ఉదాహరణ. 2014లో ఎమ్మెల్యే వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ బట్టా పాలకృష్ణలు రూ. 10 లక్షలు ఖర్చు చేసి ఈ పార్కును అభివృద్ధి చేసి, పచ్చికను పెంచి పార్కును ప్రారంభించారు.

- వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్‌ను నిర్మించినా పారిశుధ్య నిర్వహణ లోపం వల్ల చెత్త పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారైంది. పార్కులోని పచ్చదనం మటు మాయమైంది. పార్కులో నీటి వసతి ఉన్నా, వాచ్‌మెన్ ఉన్నా పచ్చదనాన్ని పెంపొందించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పార్కులో పచ్చదనాన్ని పెంపొందించి, చుట్టూ మొక్కలను నాటి అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

కానరాని పచ్చదనం

పార్కులు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచేలా, అలసిన జనాలు కొంతసేపు సేదదీరేలా ఉండాలి. పిల్లలు, పెద్దలు ఖాళీ సమయాల్లో కొంతసేపు గడిపేలా పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉంది. సీనియర్ సిటిజన్స్ ఖాళీ సమయాల్లో పార్కుల్లో సేదదీరేవిధంగా పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలి. పిల్లలు ఆడుకొనేందుకు తగిన వసతులు కల్పించాల్సి ఉంది. రాజీవ్‌గాంధీపార్కుకు సమీపంలో జీడిమెట్ల పారిశ్రామికవాడ ఉండటంతో ఈ పార్కుకు కార్మికులు ఎక్కువగా వస్తుంటారు. ఒకప్పుడు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచిన పార్కు నేడు ఎడారిని తలపిస్తుండటంతో ప్రజలు పార్కుకు రావడం మానేశారు.

దుకాణాలతో పార్కు కనుమరుగు



విశాలమైన వాతావరణంలో ఆహ్లాదాన్ని పంచేలా ఉండాల్సిన రాజీవ్‌గాంధీ పార్కు చుట్టూ దుకాణాలతో కనుమరుగవుతోంది. దుకాణాలను ఎన్నిసార్లు తొలగించినా... కొన్ని రోజులకే పరిస్థితి షరా మామూలుగా మారుతోంది. పార్కుకు వాచ్‌మెన్ ఉన్నా.. సకాలంలో మొక్కలకు నీరు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. పార్కులో పచ్చదనాన్ని పెంపొందించాలి. **- రాంచందర్, సంజయ్‌గాంధీనగర్**

పార్కు మొత్తం చెత్తమయం



ప్రతిరోజూ ఉదయాన్నే వాకింగ్ చేసేవారి కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినా అది నిరుపయోగంగా మారడంతో పార్కుకు వచ్చేవారు కరువయ్యారు. కాలనీకి ఎంతో దూరంలో ఉండే హెచ్ఎంటీ జంగిల్‌కి వెళ్లి వాకింగ్ చేయాల్సి వస్తోంది. పర్యవేక్షణ, పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో పార్కు మొత్తం చెత్త పేరుకుపోయింది. అంతే కాకుండా పార్కులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పార్కు కు వచ్చే కొద్ది మంది కూడా ఇబ్బందులు పడుతున్నారు.

- చంద్రకాంత్, షాపూర్‌నగర్



వాకింగ్ ట్రాక్‌లో పేరుకుపోయిన చెత్త

మూడు వైపులా చిరువ్యాపారాలే..

పార్కుకు ఒకవైపు ప్రధాన రహదారి ఉండగా. మూడువైపులా చిరువ్యాపారాలు సాగించడంతో అసలు ఇక్కడ పార్కు ఉందనే విషయం కొత్తవారికి తెలియడం లేదు. పార్కుకు ఆనుకొని ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగించడం వల్ల పార్కు ఆనవాళ్లు లేకుండా పోయింది. పార్కు కాంపౌండ్‌వాల్‌ను ఆనుకొని వ్యాపారాలు చేస్తున్న వారిని ఖాళీ చేయించినా కొన్ని రోజులకే పరిస్థితి యథాస్థితికి చేరుకుంటోంది. అసలు పార్కు ఎంట్రెన్స్ ఎక్కడో స్థానికులకు తప్పా కొత్తవారికి తెలియని పరిస్థితి ఈ పార్కు వద్ద నెలకొంది. ముఖద్వారం ముందు బట్టల షాపులు నడపడంతో గేటు పూర్తిగా కనిపించడం లేదు. అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న వారిని ఖాళీచేయించి పూర్తిస్థాయిలో పార్కును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.



పార్కు గేటుముందే దుస్తుల విక్రయాలు

ఆటో డ్రైవర్ ఇల్లు కూల్చివేత

- కళ్లు తిరిగి పడిపోయిన వృద్ధురాలు



అధికారులు కూల్చివేసిన ఇల్లు

జీడిమెట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ రాజీవ్‌గృహకల్పలోని 118వ బ్లాక్‌లో ఆటో డ్రైవర్ వెంకటేశ్ కుటుంబం నివాసం ఉంటోంది. జగద్గిరిగుట్ట, దుండిగల్, నిజాంపేట్ ప్రాంతాల్లోని అన్ని రాజీవ్‌గృహకల్పలలో అదనపు గదుల పేరుతో భారీ అంతస్తుల భవనాలు నిర్మించారు. అందరితో పాటు వెంకటేష్ కుటుంబం కూడా చిన్నగదిని నిర్మించుకుంది. అయితే, అక్రమంగా అదనపు గది నిర్మించారంటూ వెంకటేష్ కుటుంబ సభ్యులందరూ పనులకు వెళ్లిన సమయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసుల సాయంతో ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఇంటిని నేలమట్టం చేశారు. దీంతో ఇంట్లో ఉన్న ముసలమ్మ కుప్పకూలి పోయింది. వండుకున్న అన్నం కూడా నేల పాలైంది. సామగ్రి మొత్తం పాడైపోయింది. కాగా, రాజీవ్‌గృహకల్పలో అదనపు గదుల ముసుగులో భారీ కుంభకోణం సాగుతున్నా పట్టించుకోని అధికారులు ఒక సామాన్య ఆటో డ్రైవర్ చిన్న గదిని నిర్మించుకుంటే ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడంపై స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లక్షలు ఖర్చుపెట్టి.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- నిర్వహణ లేక నిరుపయోగంగా స్వచ్ఛ టాయిలెట్స్
- పట్టించుకోని అధికారులు



మహదేవపురం చౌరస్తా, గాజులరామారం గ్రామం ప్రధాన రోడ్డులో నిరుపయోగంగా ఉన్న స్వచ్ఛ టాయిలెట్స్

గాజులరామారం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : లక్షల రూపాయలు ఖర్చు చేసి అధికారులు ప్రజల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో నిర్మించిన స్వచ్ఛ టాయిలెట్స్ నిర్వహణ లేక నిరుపయోగం మారాయి. గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం, కైసర్‌నగర్, దేవేందర్‌నగర్, గాజులరామారం గ్రామంలో ఉన్న స్వచ్ఛ టాయిలెట్స్ ప్రజలకు ఉపయోగపడటం లేదు. ట్యాంకులపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లను, లోపల ఉన్న కుండీలు, వాష్ బేషన్ నల్లాలను ఆకతాయిలు విరగగొట్టి కొన్నింటిని ఎత్తుకెళ్లారు .దేవేందర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన డబ్బాను ఓ వ్యాపారస్తుడు తొలగించి, పక్కకు వేసి, ఆ ప్రదేశంలో తమ వ్యాపారం చేసుకునేందుకు ఒక మడిగను ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు ఈ డబ్బాలను తొలగిస్తూ నిరుపయోగంగా మారుస్తున్నారు. మరికొన్ని ప్రదేశాల్లో డబ్బాలు తుప్పు పట్టి, కింద వేసిన రేకు షీటు ఊడిపోయి వేలాడుతూ కనిపిస్తున్నాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన స్వచ్ఛ టాయిలెట్స్ ఎందుకూ పనికి రాకుండా పోతున్నా అధికారులు వీటి నిర్వహణను ఎందుకు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇకనైనా స్వచ్ఛ టాయిలెట్స్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పద్మానగర్ ఫేజ్-2లో కంకర తేలిన రోడ్డు



భగత్‌సింగ్‌నగర్ రోడ్డులో ఏర్పడిన గుంతలు



కంకర తేలిన రోడ్డు

కంకర తేలిన రోడ్లతో ప్రమాదాలు

రాకపోకలకు బస్తీవాసుల అవస్థలు

మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు

కుత్బుల్లాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అంతర్గత రహదారులు కంకర తేలి అధ్వానంగా మారడంతో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు బస్తీల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నాణ్యత లేకుండా రోడ్లు వేయడంతో కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరుకున్నాయి. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పద్మానగర్ ఫేజ్-2 లోని రావూస్ స్కూల్ రోడ్డులో రోడ్డు పాడై కంకర తేలింది. అదే విధంగా గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. బొర్రాయి రోడ్డులో కంకర తేలి రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. లీకవుతున్న మురుగు వల్ల రోడ్డంతా గుంతలుగా మారుతోంది. రాత్రి సమయంలో కంకర వల్ల అదుపు తప్పి కింద పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



భారీ ర్యాలీగా తరలివెళ్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

కేసీఆర్‌కు మద్దతుగా తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ఆరోపణలను సమాధానం చెప్పేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కార్యాలయానికి వెళ్లిన మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం హర్నిశలు కృషి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి పస లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే ఇలాంటి జిమ్మిక్కులు చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ , కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని మాజీ చైర్మన్లు ,కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.



జీడిమెట్ల డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్న విద్యార్థుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పించేందుకు ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు. - పేట్ బషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి)



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు, టీచర్లు

'అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట' ర్యాలీ

పేట్‌బషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను లాలించి చదువులు చెప్పే ఒడి అంగన్‌వాడీ బడి అని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డినగర్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు గిరినగర్, గుడెన్‌మెట్, రంగారెడ్డినగర్, చెన్నారెడ్డి నగర్, నందానగర్,గాంధీనగర్, వెంకట్‌రామిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లోని వీధుల్లో బడిబాట ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులతో సమావేశాలు నిర్వహించి, ప్రీ స్కూల్ వస్తువులు వాటి ప్రాముఖ్యతను వివరించి, అంగన్‌వాడీ బడుల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర్‌బాలలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రం నుంచి పౌష్టికాహారాన్ని తీసుకెళ్లాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని జ్యోతి అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.